తెల్ల జింక

రెండవ ముద్రణ

© తెలుగులో అనువాదం
"ప్రగతి" ప్రచురణాలయం 1974

తెల్ల జింక

లాత్వియన్ జానపద కథ

చిత్రాలు: నికొలాయ్ కొచెర్గిన్

అనువాదం: రాచమల్లు రామచంద్రారెడ్డి

"ప్రగతి" ప్రచురణాలయం

మాస్కో

వినండి బాబూ, చెప్తానూ,
సమస్య యేమీ పెద్దది కాదిది:
తెల్ల జింక ఒక టుండెను గొప్పది,
యెంతో బలమగు కొమ్ములు దానివి.
అందరికీ అది కనిపిస్తుండెను,
కానీ దొరకదు యెవ్వరికైనను.

అనగా అనగా యిద్దరు అన్నదమ్ములు. యేటి వొడ్డున రెండు ఓకు చెట్లలా బలంగా పెరిగినారు వాళ్ళు జతగా. ఒకనాడు వాళ్ల తండ్రి అన్నాడు వాళ్లతో:

''నిజంగా చెప్పండి, మీ కేవృత్తి యిష్టమో?''

కొడుకులు మొదట తలలు అడ్డం ఆడించినారు, కానీ చివరకు మనసు విప్పినారు:

''మాకు వడ్రంగం యిష్టం, కానీ అంతకంటె యిష్టం వేటగాళ్లమై, అడవిలో మృగాలనూ, ఖగాలనూ వేటాడడం.''

ఆ మాట విని తండ్రి వాళ్లకు చెరొక మంచి కుక్కనూ, విల్లూ, అమ్ములూ యిచ్చినాడు. వాళ్ల నతను ముఖద్వారం దాకా సాగనంపి, ఆశీర్వదించి పంపినాడు.

బయలుదేరిన అన్నదమ్ములకు 'యెదురైంది కాసేపటికి అడవి బాతుల గుంపు. యిద్దరూ వేసినారు బాణాలు, కానీ పడలేదు పక్షి యేదీ. అటూ యిటూ చూసేటప్పటికి దట్టమైన అడవి మధ్యలో వుండినారు వాళ్లు. దారి యేదీ కనిపించలేదు. వాళ్ల దగ్గర తినుబండారాలు వుండినాయి కొంచెమే, అయినా వాళ్లకు కలగలేదు భయం యే కొంచెమూ.

హఠాత్తుగా వాళ్లకు కనిపించినాయి రెండు దుప్పులు. అన్నదమ్ములు విల్లు లెత్తగా, అవి అన్నాయి మానవ భాషలో:

''చంపకండి మమ్మల్ని. అవసర మైనప్పుడు చేస్తాము సాయం.''

అన్నదమ్ములు మళ్లీ దారిపట్టినారు. త్వరలో వాళ్లకు కనిపించినాయి రెండు తోడేళ్లు. వాళ్లు విల్లు లెక్కుపెట్టగా, అవి అన్నాయి యిలా:

''చంపకండి మమ్మల్ని. అవసర మైనప్పుడు చేస్తాము సాయం.''

మళ్లీ దారిపట్టినారు వాళ్లు. త్వరలో వాళ్లకు యెదురైనాయి రెండు కుందేళ్లు. అన్నదమ్ములు బాణాలు సంధించగా, అవి అన్నాయి యిలా:



''చంపకండి మమ్మల్ని. అవసరమైనప్పుడు చేస్తాము సాయం.''

అన్నదమ్ము లిద్దరికీ అలా లభించినాయి అడవి జంతువులలో చెరి మూడూ మిత్రరత్నాలు: ఒక దుప్పీ, ఒక తోడేలూ, ఒక కుందేలూ. వాళ్ల వేటకుక్కలు వుండనే వుండినాయి వాళ్లవెంట.

పోగా పోగా వాళ్లకు కనపడింది చీలుదారి. యెటు పోవాలని వాళ్లకు యేర్పడింది వాదం. చివరకు వాళ్లిద్దరూ వచ్చినారు ఒక మాటకు, చెరొక దారినా పోవాలని, యెవరి అదృష్టం యెలా వుందో చూద్దామని. విడిపోయే ముందు చేసినారు వాళ్లొక పని, దించినారు తమ కత్తులు పాత ఓకుచెట్టు మొదట్లోకి. కొన్నాళ్ల తర్వాత ప్రతివొకడూ అక్కడికి వచ్చి, తన సోదరుడు యెలా వున్నదీ చూస్తాడు. కత్తి తళతళలాడుతూ, పదునుగా వుంటే, అతను క్షేమంగా వున్నట్లు. కత్తి తుప్పుపట్టివుంటే, అతను కష్టాలలో వున్నట్లు, సోదరుని సాయం అవసరమైనట్లు. యిద్దరూ విడిపోయినారు, ఒకరు యెడమకూ, ఒకరు కుడికీ తిరిగినారు.



అన్న ఒక రోజంతా నడిచినాడు, అతని కేమీ యెదురు కాలేదు. రెండవ రోజు కూడా అతని కేమీ యెదురు కాలేదు. తరువాత మూడవ రోజున కనిపించింది అతని కొక సౌధం. అది పైన్ కొయ్యతో కట్టింది, దాని గోపురం మేఘాలలో దాగింది. బయట మనుషు లెవరూ లేరు, కిటికీలో కనిపించింది అతని కొక యువతి.

"అందమైన యువతీ, అందరూ యెక్కడికి పోయినారు?" అని అడిగినాడు అతను.

"తెల్ల జింకను వెదకుతూ వెళ్లినారు వాళ్లు, అందరూ శిలలూ, రాళ్లూ అయినారు వాళ్లు. వాళ్లలో వున్నాడు మా నాన్న కూడా."

"సుందరీ, దిగులు పడకు. వాళ్లు వెళ్లినారు సహాయకులు లేకుండా. చూడు నాకెంతమంది మిత్రులో! తెల్ల జింకను వెదకడంలో వీళ్లు నాకు తోడ్పడతారు. మీ నాన్నను కూడా రక్షిస్తాను నేను."

సమస్య చిన్నది, కానీ కథ పెద్దది. అన్న గేటువద్దకు పోయేటప్పటికి తెల్ల జింక పరుగెత్తుతూ కనిపించింది అతనికి. ఉరికినాడు అతను దానికోసం, ఉరికినాయి అతని వెనుకనే దుప్పీ,

తోడేలూ, కుక్కా, కుందేలూ. కానీ అతను అనుకున్నంత సులభంగా లేదు అది, తెల్ల జింక పూరక అదృశ్యమైంది, అది వుండిన చోట పల్చని పొగమంచు లాంటిది మిగిలింది. పక్కనున్న అడవి అంచున మంటవద్ద కూర్చొని వుండిందొక ముసలిది. అన్న ఆమెను సమీపించి అడిగినాడు:

''అవ్వా, నీ మంటవద్ద చలి కాచుకోనిస్తావా?''

''కాచుకో, నాదేమీ పోదుగా. నీ జంతువులను నిమురుతాను ముందు. వాటి కేమీ చేయనులే హాని.''

''అలాగే.''

ముసలిది జంతువులను తాకిన వెంటనే అవి బూడిదరంగు రాళ్ళూ, శిలలూ అయినాయి, అతనూ అయినాడు.

తమ్ముడొక పెద్ద అడవిలో అటూ యిటూ తిరిగి, చివరకొక రాజ్యం చేరి, రాజు గొర్రెలను కాయడానికి వుండిపోయినాడు అక్కడే.

కొన్నాళ్లకు ఆ రాజ్యానికి వచ్చిందొక ఘోరమైన ఆపద. కుతకుతలాడే సముద్రంలోనుండి ఒక మహా సర్పం వెలికి వచ్చి, కోరింది రాజుగారి ముగ్గురు కూతుర్లనూ తనకు ఆహారంగా. తన కోరిక తీర్చకపోతే, తన తోకతో సముద్రాన్ని మథిస్తాననీ, బ్రహ్మాండమైన అలలు లేచి రాజుగారి నగరాలను ఊడ్చేస్తాయనీ చెప్పింది ఆ సర్పం.

రాజుకు కలిగింది దిగులు. సర్పాన్ని వధించినవానికి తన చిన్న కూతురు నిస్తానని ఆయన చేసినాడు వాగ్దానం. నలుదిక్కులా ప్రాకింది ఆ మాట. కానీ యెవరికీ ధైర్యం లేదు ముందుకు రావడానికి.

తన ముద్దుబిడ్డల గతికి వగచినాడు రాజు. కానీ, కన్నీళ్లూ, నిట్టూర్పులూ నిష్ఫలం. మరుదినం ఉదయమే ఆయన పెద్ద కూతురును తీసుకపోవలసింది సర్పానికి ఆహారంగా. తమ్మునికి తెలిసింది యీ విషయం. అతనికి అర్థం కాలేదు రాకుమార్తె యెందుకు సర్పానికి బలి కావలసిందీ. ఆ రోజు పగలంతా అతను గొర్రెల మందలు కాసినాడు. ఆ రాత్రి అతనూ, అతని ఆప్త జంతువులూ కలిసి చేసినా రొక మహా ఖడ్గం.

తెలతెలవారేటప్పుడు పెద్ద రాకుమార్తెను రథంలో యెక్కించుకొని బయలుదేరినాడు రాజ సారథి. తమ్ముడు గొర్రెలను మేపే పచ్చికబీడుకు పక్కనే వెళ్లుతూ వుండింది రథం.

''ఓయ్ సారథీ, యెక్కడికి?'' కేకవేసినాడు తమ్ముడు.

''సర్పంవద్దకు. మరెక్కడికి పోతా మనుకున్నావ్? సర్పం కోరలు పెరికే సాహసం వుందా నీకు గొల్లబ్బాయీ?''

''సాహసం వుండవచ్చుగా'' అన్నాడు తమ్ముడు. అని అతను నడిచినాడు బండివెంట.

కుతకుతలాడే సముద్రం దగ్గర యిసుకలో ఆపినాడు రథాన్ని సారథి. రాకుమార్తె రథం దిగింది, కంటికి మంటికి యేకధారగా యేడుస్తూ, తనను రక్షించేవాళ్లెవరూ లేరా అని మొరపెట్టుతూ. సారథి తనకు ఆయుధం లేదన్నాడు, ఒంటరిగా సర్పాన్ని యెదిరించలే నన్నాడు; అంటూ అతను రథాన్ని దూరంగా తోలుకపోయి నిలిపినాడు.

సముద్రం నలుపెక్కి, ఉగ్రరూపం ధరించింది; అలలలోనుండి వచ్చింది మూడు తలల మహాసర్పం.

తమ్ముని ఆప్త జంతువులు సర్పంమీద కలబడినాయి. అతనొక గుర్రంమీదికి యెగిరి తన మహా ఖడ్గంతో ఒక్క వ్రేటుతో నరికినాడు దాని తలలు మూడూ. అతను దాని నాలుకలు కోసి,

వేసుకున్నాడు తన సంచిలో. మాటా, పలుకూ లేకుండా అతను పోయినాడు వేగంగా తన గొర్రెల మంద వద్దకు, అలా పోవడం న్యాయమైనట్లు. సారథికి కలిగింది దురాలోచన. అతను రాకుమార్తెవద్దకు వచ్చి అన్నాడు:

''మేము నిన్ను రక్షించినాము తెలుసా? గొల్లవాడు కూడా యిక్కడికి వచ్చినట్లు అనవద్దు యెవరితోనూ. లేదా నీ ప్రాణం దక్కదు. రాజు అడిగితే, 'సారథి నన్ను సముద్రంవద్దకు తీసుకపోయినాడు, మళ్లీ వెనక్కి తెచ్చినాడు. అతనే అర్హుడు బహుమతికి' అని చెప్పాలి నీవు.''

రాకుమార్తె ఒప్పుకుంది విధిలేక, తన ప్రాణం పోగొట్టుకోడానికి యిష్టం లేక.

మరుదినం వచ్చింది కుతకుతలాడే సముద్రంనుండి ఆరు తలల మహాసర్పం.

అదే సారథి రాజుగారి రెండవ కుమార్తెను సర్పానికి ఆహారంగా తీసుకపోయినాడు. తమ్ముడు గొర్రెలను మేపే అదే పచ్చిక బీడుకు పక్కనే వెళ్లింది రథం. యీసారి కూడా తమ్ముడు రాకుమార్తెను రక్షించినాడు. అతను సర్పం నాలుకలు కోసి, వేసుకున్నాడు తన సంచిలో.

మూడవ నాడు అదే సారథి రాజుగారి చిన్న కూతురును తీసుకపోయినాడు సర్పానికి ఆహారంగా. మూడవ సారి మళ్లీ, తమ్ముడు గొర్రెలను మేపే అదే పచ్చిక బీడుకు పక్కనే వెళ్లింది రథం. మూడవ సారి మళ్లీ అతను నడిచినాడు బండివెంట.

మూడవ సారి మళ్లీ, కుతకుతలాడే సముద్రం దగ్గర యిసుకలో ఆపినాడు రథాన్ని సారథి. చిన్న రాకుమార్తె రథం దిగింది, కంటికి మంటికి యేకధారగా యేడుస్తూ, తనను రక్షించేవాళ్లెవరూ లేరా అని మొరపెట్టుతూ. మూడవ సారి మళ్లీ, సారథి తనకు ఆయుధం లేదన్నాడు, ఒంటరిగా సర్పాన్ని యెదిరించలే నన్నాడు; అంటూ అతను రథాన్ని దూరంగా తోలుకపోయి నిలిపినాడు. సముద్రం నలుపెక్కి, ఉగ్రరూపం ధరించింది; అలలలోనుండి వచ్చింది తొమ్మిది తలల మహాసర్పం. తమ్ముని ఆప్త జంతువులు సర్పంమీద కలబడినాయి. అతను తన మహాఖడ్గంతో ఒక్క వేటుతో నరికినాడు దాని తలలు తొమ్మిదీ. అప్పుడు రాకుమార్తె జారవిడిచింది తన ఉంగరం అతని చేతిలోకి, సారథికి కనిపించకుండా. తమ్ముడు వినయంగా తల వంచి, సర్పం నాలుకలు తొమ్మిదీ కోసి, వేసుకున్నాడు తన సంచిలో. మాటా, పలుకూ లేకుండా అతను పోయినాడు వేగంగా తన గొర్రెల మందవద్దకు, అలా పోవడం న్యాయమైనట్లు.

సారథికి కలిగింది దురాలోచన. అతను రాకుమార్తెవద్దకు వచ్చి అన్నాడు:

"మేము నిన్ను రక్షించినాము తెలుసా? గొల్లవాడు కూడా యిక్కడికి వచ్చినట్లు అనవద్దు యెవరితోనూ. లేదా నీ ప్రాణం దక్కదు. రాజు అడిగితే, 'సారథి నన్ను సముద్రంవద్దకు తీసుకపోయినాడు, మళ్లీ వెనక్కి తెచ్చినాడు. అతనే అర్హుడు బహుమతికి' అని చెప్పాలి నీవు."

రాకుమార్తె ఒప్పుకుంది విధిలేక, తన ప్రాణం పోగొట్టుకోడానికి యిష్టం లేక.

రాజుకు కలిగింది బ్రహ్మానందం. ఆయన సారథిని ఆలింగనం చేసుకొని అన్నాడు:

"నీవు నా కుమార్తెల నందరినీ రక్షించినావు ఘోరమైన దుర్మరణంనుండి. విను నా అభీష్టం: నీకు నా చిన్న కూతురు నిస్తాను భార్యగా, నా రాజ్యంలో అర్ధ మిస్తాను పైగా."

రాజు మాటకు తిరుగు లేదు. మూడవ రోజున పెట్టినారు పెండ్లికి ముహూర్తం. మరి గొల్లవాని మాటేమిటి? అతను తన సంచి భుజాన వేసుకొని బయలుదేరినాడు అంతఃపురానికి

చిన్న రాకుమార్తె చూసింది అతన్ని. రాజుతో అన్నది ఆమె యిలా:

"నేను వివాహ మాడుతాను నా ఉంగరం యెవరివద్ద వుందో అతణ్ని, నన్ను సర్పం బారినుండి రక్షించినవాణ్ని."

సరిగ్గా అప్పుడు సారథి అందించినాడు ఆమె చేతికి ద్రాక్షసారా పాత్రను. ఆమె ఒక గుక్క తాగి, అందించింది దానిని గొల్లవానికి. గొల్లవాడు అందులో వేసినాడు ఆమె ఉంగరం, సారథి కానకుండా.

రాకుమార్తె అప్పు డన్నది రాజుతో:

"యితనే నన్ను రక్షించింది."

కానీ నమ్మకం కలగలేదు రాజుకు.

"నా ఉంగరం తగిన రుజువు కాకుంటే, సర్పాల నాల్కలు కలవాణ్ని నేను వివాహ మాడుతాను!"

రాజు అన్నాడు సారథితో:

"యేదీ, చూపించు సర్పాల నాల్కలు, ముహూర్తం సమీపిస్తున్నది."

కానీ లేవుగా నాల్కలు అతనివద్ద; యెలా చూపించగలడు అతను? పలకలేదు సారథి.

యింతలో తమ్ముడు వచ్చి, రాకుమార్తె పక్కన నిలబడినాడు. సర్పాల నాల్కలు పద్దెనిమిదీ చూపినాడు అతను రాజుకు.

గొల్లవాణ్ని బంగారు జరీ వస్త్రాలతో అలంకరించి, తన చిన్న కూతురుతో పెండ్లి జరిపించమని ఆజ్ఞాపించినాడు రాజు. కుయుక్తుల, కుత్సితాల సారథి అంతఃపురంనుండి బహిష్కరింప బడినాడు శాశ్వతంగా. అలా పెండ్లాడినాడు తమ్ముడు అందాల రాకుమార్తెను. పైగా లభించింది అతనికి రాజ్యంలో అర్ధ భాగం. నిత్య కళ్యాణం పచ్చ తోరణం ఆనాటినుండి అతని జీవితం.

కొన్నాళ్ళు జరగగా, వచ్చింది ఒకనాడు అతనికి ఆలోచన,

ఓకు చెట్టువద్దకు పోయి, అన్న కత్తి యెలా వుందో చూడాలని. అది పిడిదాకా తుప్పపట్టి వుండింది. తన సోదరుడు గొప్ప ఆపదలో వున్నా డన్నమాట. భార్యను వదలి వెళ్లడం అయిష్టమైనా, తమ్ముడు తన ఆప్త మిత్రులైన కుక్కనూ, దుప్పినీ, తోడేలునూ, కుందేలునూ వెంటబెట్టుకొని, బయలు దేరినాడు అన్నను వెదకుతూ.

నడవగా, నడవగా కనిపించింది అతని కొక సౌధం. అది సైన్ కొయ్యతో కట్టింది, దాని గోపురం మేఘాలలో దాగింది. బయట మనుషు లెవరూ లేరు, కిటికీలో కనిపించింది అతని కొక యువతి.

''అందమైన యువతీ, అందరూ యెక్కడికి పోయినారు?'' అని అడిగినాడు అతను.

''తెల్ల జింకను వెదకుతూ వెళ్లినారు వాళ్లు, అందరూ శిలలూ, రాళ్లూ అయినారు వాళ్లు. మరొక వేటకాడు వచ్చినాడు యిక్కడికి. అతనూ వెళ్లినాడు జింకకోసం.''

''అతనే మా అన్న! రక్షించాలి అతణ్ని.''

సమస్య చిన్నది. కానీ కథ పెద్దది. తమ్ముడు గేటువద్దకు పోయేటప్పటికి, తెల్ల జింక పరుగెత్తుతూ కనిపించింది అతనికి. ఉరికినాడు అతను దానికోసం, ఉరికినాయి అతని వెనుకనే అతని ఆప్త జంతువులు. కానీ అతను అనుకున్నంత సులభంగా లేదు అది, తెల్ల జింక వూరక అదృశ్యమైంది, అది వుండిన చోట పల్చని పొగమంచు లాంటిది మిగిలింది. పక్కనున్న అడవి అంచున మంటవద్ద కూర్చొని వుండిందొక ముసలిది. తమ్ము డామెను సమీపించి అడిగినాడు:

''అవ్వా, యిక్కడున్న యీ బూడిదరంగు శిలలూ , రాళ్లూ అన్నీ యేమిటి?''

మునలిది అన్నది:

''నీ జంతువులను నిమురుతాను ముందు. వాటి కేమీ చేయనులే హాని. తరువాత చెప్తాను నీ వడిగింది.''

''వద్దు. నీవు కుయుక్తులలో నక్కవు. నేనేమీ తెలివి తక్కువవాణ్ణి కాదు. తెలుసా, నా ఖడ్గం యెంత పదునుగా వుందో?''

మునలి మంత్రకత్తె విధిలేక ఒప్పుకుంది.

''యీ శిలలు ఒకప్పుడు మనుషులు, యీ రాళ్లు జంతువులు. వాళ్లలో మీ అన్న ఒకడు'' అన్నది ఆమె.

''యీ మంత్రకట్టు విప్పడం యెలాగో చెప్పు. మరచిపోవద్దు నా ఖడ్గం వాడి.''

''మంట వుందా యిక్కడ? దీని బూడిద కాస్త తీసుకొని చల్లు శిలలమీదా, రాళ్లమీదా.''

తమ్ముడు చేసినాడు సరిగ్గా అలాగే. నిజంగానే శిలలన్నీ మారినాయి మనుషులుగా, ఒక రాజ్యంలో వున్నంతమంది, వాళ్ల రాజుతో సహా. వాళ్లలో వుండినాడు అన్న, అతని ఆప్త జంతువులతో సహా. జంతువులన్నీ దుమికినాయి మంత్రకత్తెమీదికి. అంతే — అయిపోయింది మునలిదాని పని.

అందరూ యెంత ఆనందించినారో! రాజు అన్నకు తన కూతురు నిచ్చి పెండ్లిచేసినాడు. ఆమెమీద కూడా మంత్రకట్టు వుండింది, రాజసౌధం వదలి బయటికి పోలేకుండా. యిప్పు డది వదలింది.

తమ్ముడు తన భార్యవద్దకు వెళ్లిపోయినాడు. అప్పటినుండి అందరూ హాయిగా వుండినారు.

మరి తెల్ల జింక మాటేమిటి? వినండి, చెప్తాను. మంత్రకత్తె మరణించిన క్షణమే తెల్ల జింక ఒక మాను మొద్దుకు తట్టుకొంది, మంత్రకత్తె దానిమీద వేసిన మంత్రకట్టు వదలింది. అప్పటినుండి అది అడవులలో స్వేచ్ఛగా పరుగులు తీస్తూవుండింది, యెవరికీ హాని కలిగించకుండా.

БЕЛЫЙ ОЛЕНЬ

На языке телугу

Б $\frac{70802-344}{014(01)-79}$ без объявл.

4803000000

సోవియట్ యూనియన్‌లో ముద్రించబడింది